క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్‌గా కళ్లం



తోట్లవల్లూరు: మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్‌గా మాజీ ఎంపీపీ కళ్లం వెంకటేశ్వరరెడ్డిని నియమించినట్లు పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. పార్టీ బలోపేతానికి పాటుపడాలని ఎమ్మెల్యే సూచించారు. వెంకటేశ్వరరెడ్డిని ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు అభినందించారు.

25 నుంచి మినుము కొనుగోళ్లు

ముదినేపల్లిరూరల్: మండలంలో ఈ నెల 25వ తేదీ నుంచి మినుముల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామని ఏఓ బి.వేణుమాధవ్ తెలిపారు. మినుములకు క్వింటాకు కనీస మద్దతు ధరగా రూ.6,600 నిర్ణయించామన్నారు. స్థానిక రైతుభరోసా కేంద్రాల్లో రైతులు పంటసాగు వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠా

కోసూరు(మొవ్వ): మండల పరిధిలోని కోసూరులో శ్రీ హనుమాన్ సీతాలక్ష్మణ సమేత శ్రీ సీతారామ స్వామి వార్ల అభినవ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం విశేష పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. మందిర ఏర్పాటుకు స్థలాన్ని చిందా రాఘవరాజు, సరస్వతి బాయ్‌లు అందించగా, మందిర నిర్మాణం, విగ్రహాలను మురారి శ్రీనివాసరావు, కవిత దంపతులు అందజేశారని అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు.

శ్మశానవాటిక అభివృద్ధి చేయాలని వినతి

ముదినేపల్లిరూరల్: స్థానిక ముస్లిం శ్మశానవాటికను అభివృద్ధి చేయాలని ముస్లిం ప్రతినిధులు కోరారు. మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అల్లా భక్షు, వైఎస్సార్‌సీపీ నేత షేక్ గౌస్ ఆధ్వర్యంలో ముస్లింలు సర్పంచ్ నిమ్మగడ్డ కై కమ్మకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.

ముగిసిన జాతీయ స్థాయి సదస్సు

గుడివాడరూరల్: వీకేఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా ఆర్‌కేజీఎస్ అప్లికేషన్స్ ఇన్ సివిల్ ఇంజినీరింగ్ పేరిట జరుగుతున్న వర్క్‌షాప్ మంగళవారంతో ముగిసింది. కళాశాల సివిల్ విభాగాధిపతి కొల్లిపర దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో ముగింపు కార్యక్రమంలో విజయవాడ లర్నేట్ స్కిల్స్ లిమిటెడ్ రిసోర్స్ పర్సన్ అనూష ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వర్క్‌షాప్‌లో 25 మంది సివిల్ విద్యార్థులకు ఈ సాఫ్ట్‌వేర్‌పై తర్ఫీదు ఇచ్చామని సివిల్ విభాగాధిపతి దుర్గాప్రసాద్ తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య చేతుల మీదుగా విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌ఈ ప్రసాదరావు, కన్వీనర్ దుర్గాప్రసాద్, సహ కన్వీనర్లు జీవీఎస్‌ఎస్ రామకృష్ణ, జి.అన్వేష్, లక్ష్మీసాయి, మైత్రి పాల్గొన్నారు.

ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలి

మొవ్వ: ఇంటి పన్నుల వసూలును గ్రామ పంచాయతీలు ఈ నెలాఖరు నాటికి 65 శాతం పూర్తి చేయాలని మొవ్వ మండల ఈఓపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఇంటి పన్నుల వసూలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలో బకాయిలతో కలిపి రూ.1.80 కోట్లు వసూలు చేయాల్సి ఉండగా ఇప్పటికీ 47 శాతం మాత్రమే వసూలు చేశారని, ఎట్టి పరిస్థితుల్లో లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ పంచాయతీ గ్రేడ్-1 కార్యదర్శి ఏడీవీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

నేటి ఎమ్మెల్యే డీఎన్నార్ పర్యటన

కైకలూరు: మండవల్లి మండలం మొఖాసాకల్వపూడిలో ప్రాథమిక సహకార పరపతి సంఘ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డీఎన్నార్ బుధవారం శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు. ఉదయం కైకలూరు సీతారామ ఫంక్షన్ హాల్లో కైకలూరు మండల జేసీ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం కలిదిండి మండలం వెంకటాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారన్నారు.

పెళ్లి కారుకు ప్రమాదం

మండవల్లి: హైదరాబాద్ నుంచి భీమవరం సమీపంలోని గ్రామంలో పెళ్లి నిమిత్తం మంగళవారం రాత్రి వస్తున్న కారు ప్రమాదానికి గురైంది. మండవల్లి అగ్రహారం వద్ద రోడ్డు విస్తరణ పనులకు తీసిన గుంతలో కారు పడిపోవడంతో కారు స్వల్పంగా దెబ్బతింది. కారులోని వ్యక్తులు క్షేమంగానే ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

కైకలూరు(కలిదిండి): స్థానిక పార్వతీ సమేత పాతాళ భోగేశ్వరస్వామికి మహాశివరాత్రి మహోత్సవాల సందర్భంగా భక్తులు సమర్పించిన హుండీ కానుకలను బుధవారం ఉదయం లెక్కిస్తామని ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.

ముమ్మరంగా చెరకు రవాణా

- మండలంలో 1,800 ఎకరాల్లో పంట సాగు
- ట్రాక్టర్లు, ఎడ్లబండ్లపై కేసీపీకి చెరకు తరలింపు
- వ్యవసాయ పనులతో గ్రామాల్లో సందడి



తోట్లవల్లూరులో చెరకు నరుకుతున్న కూలీలు

తోట్లవల్లూరు: మండలంలో చెరకు రవాణా ముమ్మరంగా సాగుతోంది. పంటకాలం పూర్తి కావటంతో అన్నదాతలు చెరకు నరుకుడు పనులపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు మంచి దిగుబడులు రావాలని ఆశిస్తూ అన్నదాతలు చెరకు రవాణను గతకొన్ని రోజులుగా చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఒక వైపు ధాన్యం నూర్పిడి పనులు.. మినుముతీతలు, మరోవైపు చెరకు నరుకుడు, రవాణాతో గ్రామాల్లో వ్యవసాయ సీజన్ నడుస్తోంది.

విస్తారంగా సాగు..

తోట్లవల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు చెరకు పంటను విస్తారంగా సాగు చేస్తారు. కృష్ణానది గర్భంలోని లంకలతో పాటు మెట్ట, మాగాణి భూముల్లో 2022–23 సీజన్‌కు సబంధించి సుమారు 1,800 ఎకరాలకుపైగా చెరకు పంటను రైతులు సాగు చేశారు. 2003 వి 46, ఆర్‌ఓసి 16, 2009 ఏ 107 వంటి రకాలను ఎక్కువగా వినియోగించారు. ఏడాది పాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకుని, పక్వానికి రాగానే ఉయ్యూరు కేసీపీ చక్కెర కర్మాగారానికి తరలిస్తున్నారు.

పెట్టుబడికి భరోసా..

చెరకు పంటను పెట్టుబడికి గ్యారంటీ పంటగా రైతులు భావిస్తారు. విత్తన ఖర్చులు, తక్కువ వడ్డీపై ఎరువులను అందించి కేసీపీ రైతులకు అండగా ఉండటంతో సాగుపట్ల రైతులు సుముఖత చూపుతున్నారు. వాతావరణ ప్రతికూలతలను సైతం తట్టుకుని పెట్టిన పెట్టుబడికి కనీస భద్రత ఒక్క చెరకు సాగులోనే లభిస్తోంది. దీంతో ఈ ప్రాంతంలోని ప్రతిరైతు ఎంతో కొంత విస్తీర్ణంలో చెరకు పంటను సాగు చేయటం ఆనవాయితీగా వస్తోంది.



ఎడ్లబండ్లపై చెరకును కేసీపీకి తరలిస్తున్న రైతులు

త్వరితగతిన నగదు చెల్లింపులు..

2022–23 సీజన్‌కు సంభందించి చెరకు నరుకుడు, రవాణాను రైతులు చురుగ్గా నిర్వహిస్తున్నారు. ఎకరానికి సగటున 40 నుంచి 50 టన్నుల వరకు దిగుబడి రావచ్చని అంచనా వేస్తున్నారు. టన్ను చెరకుకు ఈ సీజన్‌కు ఉయ్యూరు కేసీపీ కర్మాగారం రూ.2,966 ఇస్తున్నట్లుగా ప్రకటించింది. చెరకును ఫ్యాక్టరీకి తరలించిన 10 రోజుల తరువాత రైతుల ఖాతాకు నేరుగా నగదు చెల్లింపులు జరుపుతున్నట్లు కేసీపీ ప్రాంతీయ అధికారి రామచంద్రరావు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలి

పామర్రు(పమిడిముక్కల): లంకపల్లి నుంచి కూడేరు వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్‌ను కోరారు. వెంటనే సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి రహదారి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. పమిడిముక్కల మండలం లంకపల్లి గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను తెలుసుకుని అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకున్నారు. గత మూడున్న ఏళ్ల ప్రభుత్వ పాలనలో గ్రామంలో ప్రజలకు ప్రభుత పథకాల ద్వారా అందిన లబ్ధిని వివరిస్తూ, సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు.

సర్వతో ముఖాభివృద్ధే లక్ష్యం

అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సర్వతో ముఖాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం లక్ష్యంగా పాలన అందిస్తోందన్నారు. సీఎం వైఎస్ జగన్ పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, చిన్న, సన్నకారు రైతులు, చిరు వ్యాపారుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాలను ప్రవేశ పెట్టి సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందిస్తున్నారని చెప్పారు.



లంకపల్లిలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ప్రజలందరూ సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలు పథకాలు అమలుకు సిఫార్సులు చేస్తేనే దక్కేవన్నారు. కాని ప్రస్తుతం జగన్ ప్రభుత్వంలో ప్రతి నెల 1వ తేదీన సూర్యోదయానికి ముందే పింఛన్లను వలంటీర్లు ఇళ్లకు వచ్చి అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మొవ్వ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ కొడాలి రాంబాబు, ఎంపీటీసీ మీర్జా సజాద్ ఆలీ, వైస్ ఎంపీపీలు కొడమంచిలి మహేష్, గంజాల సీతారామయ్య, సర్పంచ్ వేమూరి రత్నకుమారి, మండల కన్వీనర్ యలమంచిలి గణేష్, రెడ్డిక కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ కంభపు రాంబాబు, మండల ప్రధాన కార్యదర్శి మారపాక మహేశ్వరరావు, మాజీ ఎంపీపీ కౌంతి వెంకటేశ్వరరావు, నాయకులు పాతూరి చంద్రపాల్, కనుమూరి వెంకటేశ్వరరావు, గండ్రపు స్వరూపరాణి, ముళ్లపూడి సోమయ్య, వేమూరి రమేష్ పాల్గొన్నారు.

మనోవికాసానికి మాతృభాష దోహదం

ముదినేపల్లిరూరల్: విద్యార్థుల మానసిక వికాసానికి మాతృభాష ఎంతగానో దోహదం చేస్తుందని వడాలి జెడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ నాగమల్లేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని ముదినేపల్లి మండలం వడాలి జెడ్పీహైస్కూల్లో మంగళవారం నిర్వహించారు. ఉపాధ్యాయులు వాసవీ, సత్యనారాయణ, సలోమీ, ప్రకాశరావు పాల్గొన్నారు.

పామర్రు: పామర్రు సాహితీ స్రవంతి, టీఎస్‌ఆర్ అండ్ టీబీకే ప్రభుత్వ డిగ్రీ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహా కవి శ్రీశ్రీ రచించిన మహా ప్రస్థానంపై చర్చా గోష్ఠి నిర్వహించారు. సివిక్స్ అధ్యాపకులు దునుకు రఘునాథరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ అడపా కేదారి, సాహితీవేత్తలు సీహెచ్ రవికుమార్, కవిదాసు, ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ, అధ్యాపకులు పద్మ, మేరీకృపావతి, రాధిక, గంగాధరప్రసాద్, ఆదిశేషు, రామస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

గుడివాడరూరల్: తెలుగుభాష అభివృద్ధికి అందరూ కృషి చేయాలని విశ్రాంత తెలుగు అధ్యాపకులు కొడాలి సోమసుందరరావు పేర్కొన్నారు. స్థానిక షాగులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో తెలుగుభాషా వికాస సమితి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్గీయ ఎంఆర్ నాగేశ్వరరావు సాహితీపురస్కారం -2023ను విశ్రాంత ఉపాధ్యాయుడు పాపన బోయిన వెంకటేశ్వర్లుకు అందచేశారు. సమితి సమన్వయకర్త డీఆర్‌బీ ప్రసాద్, సాహితీవేత్తలు జి.శ్రీనివాస్, పిన్నమనేని వేణుగోపాలరావు, పిన్నమనేని రామచంద్రరావు, జి.మోహనబాబు, ఆవిర్నేని వెంకటేశ్వరరావు, గ్రంథాలయ ఇన్‌చార్జి ప్రవల్లికలు పాల్గొన్నారు.

తారకరామా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

తారకరామా వాకర్స్‌క్లబ్ గుడివాడ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. విశ్రాంత అధ్యాపకుడు కొడాలి సోమసుందరరావును క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్‌ఆలీ, సభ్యులు కొల్లాబత్తుల రామకృష్ణ, దండమూడి సీతా రామస్వామి, గోరంట్ల శ్యాంబాబు, కొల్లిపర సాయి సుబ్రహ్మణ్యం, ఎం.బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మధురమైనది మన తెలుగుభాష

గుడివాడరూరల్: అమ్మలాంటి కమ్మనైనది, మధురమైనది తెలుగు భాష అని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెఎస్ అప్పారావు పేర్కొన్నారు. స్థానిక ఏఎన్నార్ కళాశాల తెలుగు విభాగం, అక్కినేని కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించి తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవితా రచన పోటీల్లో భవానీ ప్రథమ, నాగసాయి శ్రావణి ద్వితీయ, పద్యాలాపన పోటీల్లో త్రిస్నీ ప్రథమ, వైష్ణవి ద్వితీయ స్థానాలు సొంతం చేసుకున్నారు. వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ పిజెఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్, ఎంబీఏ హెడ్ లక్ష్మీనాథ్, కళాపీఠం కన్వీనర్ డీఎస్ ప్రత్యూష, తెలుగు అధ్యాపకురాలు నాగలక్ష్మి పాల్గొన్నారు.



తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పాలకవర్గ సభ్యులు



వడాలి జెడ్పీహైస్కూల్లో మాట్లాడుతున్న ఇన్‌చార్జి హెచ్‌ఎం నాగమల్లేశ్వరరావు

ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలి

గుడివాడరూరల్: జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని నందివాడ మండల ప్రత్యేకాధికారి, జిల్లా ఇండస్ట్రీయల్ మేనేజర్ ఆర్.వెంకట్రావ్ పేర్కొన్నారు. నందివాడ మండల పరిషత్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై వివిధ శాఖల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిల్లుల మంజూరు విషయంలో ఎటువంటి అసౌకర్యం లేకుండా మంజూరయ్యేలా అధికారులు లబ్ధిదారులతో సహకరించాలన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కార్యదర్శులకు మార్గదర్శకాలు జారీ చేశారు.

సమావేశంలో ఎంపీడీఓ బి.వై.విష్ణుప్రసాద్, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ ఏఈ రాధాకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రూపేష్, డెప్యూటీ తహసీల్దార్ మల్లిక, ఏపీఎం ప్రధానరావు, వెలుగు సీసీలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

వెంట్రప్రగడ(పెదపారుపూడి): జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీఓ టి.సీతామహాలక్ష్మి లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని వెంట్రప్రగడ సచివాలయం వద్ద మంగళవారం హౌసింగ్ నిర్మాణ పనులపై లబ్ధిదారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వలంటీర్ల ద్వారా ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు నిర్మాణ పనులు పూర్తి చేశారో, ఎన్ని వివిధ దశలో ఉన్నయో అడిగి తెలుసుకున్నారు. లేఅవుట్‌లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి, ఎంపీడీఓ కార్యాలయం సూపరింటెండెంట్ సీహెచ్ రమణారావు, పంచాయతీ కార్యదర్శి సాగర రాణి తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ విధానంలో మిరప సాగు లాభదాయకం

రాపర్ల(పామర్రు): సేంద్రియ విధానంలో మిరప సాగు లాభదాయకమని డీటీసీ కేంద్రం అధికారులు తెలిపారు. గ్రామంలో ఐదు ఎకరాల విస్తీర్ణంలో రైతు కాకర్ల శ్రీనివాసరావు మిరప పంటను సేంద్రియ విధానంతో సాగు చేస్తున్నారు. ఈ పొలాన్ని కృష్ణా జిల్లా ట్రైనింగ్ సెంటర్(డీటీసీ) కో ఆర్డినేటర్ జ్యోతిరమణి తదితర వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులను ఉపయోగించటం వలన పంటకు ఎటువంటి హాని కలుగదని చెప్పారు. డీటీసీ ఏఓ పద్మజ, ఏడీఏ స్వర్ణలత, ఏఓ శివనాగరాణి, రైతు కాకర్ల శ్రీనివాసరావు ఉన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని పెదపాలపర్రు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. బరువు, ఎత్తు, హెమోగ్లోబిన్ వంటి పరీక్షలను నిర్వహించి యాప్‌లో నమోదు చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి, శరణ్య, ఆశా వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో ప్రతిభ

మండవల్లి: ఏలూరులోని కస్తూర్బా బాలికోన్నత పాఠశాలలో ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్ పోటీల్లో కానుకొల్లు హైస్కూల్ 9వ తరగతి విద్యార్థిని జి.హేమశ్రీ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందని సైన్స్ టీచర్ కె.శ్యాంప్రసాద్ మంగళవారం తెలిపారు. వ్యాసరచన పోటీల్లో జిల్లాలో హేమశ్రీ ద్వితీయ స్థానం సాధించిందన్నారు. జిల్లా విద్యాశాఖధికారి ఎస్.రవిసాగర్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుందని చెప్పారు. కార్యక్రమంలో కానుకొల్లు హైస్కూల్ సైన్స్ ఉపాధ్యాయులు కె.శ్యాంప్రసాద్, వి.భాగ్యకుమారి గైడ్ టీచర్లుగా వ్యవహరించారన్నారు.

కుంభాభిషేక మహోత్సవం ప్రారంభం

నిమ్మకూరు(పామర్రు): గ్రామంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అష్టబంధన మహా సంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత ప్రార్థనాసూక్తి పఠనం, వాస్తు పూజ, వివిధ హోమాలు నిర్వహించారు. సాయంత్రం మృత్యంగ్రహణ, అంకురార్పణ కార్యక్రమాలను నిర్వహించామని ఆలయ కార్యనిర్వహణాధికారి ధర్మారెడ్డి తెలిపారు. ఆలయంలో పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు పరాశరం యోగానంద లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించారు.

పంచాయతీల్లో తాగునీటి సమస్యకు చెక్

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) పరిష్కారం చూపారు. మండవల్లి మండలం పసలపూడి, చింతలపూడి గ్రామ పంచాయతీలకు సర్పంచ్‌లు ఉచ్చుల కృష్ణారావు, కాగిత సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలకు అందిన లబ్ధికి సంబంధించిన బ్రోచర్లను వారికి అందజేశారు. ఆయా గ్రామాల్లో తాగునీటి సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టి తీసుకొచ్చారు.

రూ.70 లక్షల నిధులు మంజూరు..

దీనిపై ఎమ్మెల్యే డీఎన్నార్ స్పందిస్తూ పసలపూడి పంచాయతీకి పైప్‌లైన్, ఫిల్టర్‌బెడ్‌కు రూ.40 లక్షలు, చింతలపూడి పంచాయతీకి రూ.30 లక్షలు మంజూరు చేశామన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము), వైస్ ఎంపీపీ ఆగస్తి ఆదివిష్ణు, జెడ్పీటీసీ సభ్యురాలు ముంగర విజయనిర్మల, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చేబోయిన వీర్రాజు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బేతపూడి యేసోబురాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, బుర్ల భోగేశ్వరరావు, నాగదాసి థామస్, మాజీ ఎంపీపీ ముంగర గోపాలకృష్ణ, మాజీ సర్పంచ్ బలే నాగరాజు, మెండా సురేష్, మాజీ ఎంపీటీసీ కూనా శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్వీ రాధిక, వీఆర్వో డి.రేగేశ్వరరావు పాల్గొన్నారు.



పసలపూడిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

జగనన్న సైనికులుగా గర్వంగా పనిచేయండి

కైకలూరు: జగనన్న సైనికులుగా వైఎస్సార్ సీపీ సచివాలయ కన్వీనర్లు, గ్రామ గృహ సారథులు గర్వంగా పనిచేయాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. ఎంపీపీ అడవి కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక సీతారామఫంక్షన్ హాలులో కైకలూరు మండలం 11 గ్రామ సచివాలయాల పరిధిలోని సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. భారీ డిజిటల్ స్క్రీన్ ద్వారా మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమ వివరాలను వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఇప్పుడు వలంటీరు ఇరువురు గృహ సారథులను తీసుకెళ్లి కుటుంబాలకు పరిచయం చేయాలని సూచించారు. సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు పర్యవేక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ, ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీ రామ దుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు బత్రాజు శివాజీ, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, సర్పంచులు మేరీ నవ రత్న కుమారి, ఉప్పలపాటి నాగమణి, ఘంటసాల శేషారావు, జయమంగళ కాసులు, గరికిముక్కు మరియమ్మ, ఎంపీటీసీ సభ్యులు మంగినేని రామకృష్ణ, బంటుమిల్లి సాధు కొండయ్య, పందు గాంధీ ప్రసాద్, పెన్మెత్స సూర్య నారాయణ రాజు, నాయకులు గంగుల అశోక్, పడమటి శేషావతారం, ఎస్.శ్యామ్ సుందర్, గురజాల వేణు పాల్గొన్నారు.



గృహ సారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

దేశంలోనే సరికొత్త పాలనకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం

తోట్లవల్లూరు: రాష్ట్రంలో గ్రామ సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ఏర్పాటుతో దేశంలోనే సరికొత్త పాలనకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ చెప్పారు. మండలంలోని గరికపర్రు సాయిబాబా కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం మంగళవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కొనసాగించే దమ్ము టీడీపీకి ఉందా అని ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ప్రతిహామీని నెరవేర్చటంతోపాటు ఇవ్వని హామీలను కూడా అమలు చేసిన ఘనత జగనన్నదేనన్నారు.

మా నమ్మకం నువ్వే జగన్..

మార్చి 18 నుంచి 26 వరకు గృహ సారథులు వారికి నిర్దేశించిన ఇళ్లకు వెళ్లి గత నాలుగేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించటంతోపాటు మా నమ్మకం నువ్వే జగన్ పేరుతో ఉన్న స్టిక్కర్‌లను అంటించాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సూచించారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ పరిశీలకుడు సోంబాబు, ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ కళ్లం వెంకటేశ్వరరెడ్డి, నాయకులు నడకుదురు రాజేంద్ర, మోర్ల రామచంద్రరావు, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు బి.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.గంగాభవాని, ఎస్.రమేష్, ఎన్.ప్రభుదాస్, ఎం.వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శివనాగమల్లేశ్వరరావు, చంద్రశేఖర్, వీరంకి రాము, వి.రత్నాకర్ పాల్గొన్నారు.



గరికపర్రులో కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పరిశీలకుడు సోంబాబు

క్రీడాకారులకు అభినందన

గుడివాడరూరల్: ఇటీవల పశ్చిమ బెంగాల్‌లో జరిగిన 42వ జాతీయ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో స్టేడియం అథ్లెటిక్స్‌లో 45 ఏళ్ల పైబడిన క్రీడాకారులు విజేతలుగా నిలవడం అభినందనీయమని ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పేర్కొన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో క్రీడాకారులుగా కె.వి.నాగులు, టి.వెంకటేశ్వర్లు, అప్పలస్వామి, జి.పి.చౌదరి, పి.సుధాకర్, కె.వెంకటేశ్వరరావు, వి.రామ్‌ప్రసాద్‌లను అభినందించారు. బొగ్గవరపు తిరుపతయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టర్స్..

ఇటీవల కృష్ణాజిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్టేడియం జిమ్‌కు చెందిన వెయిట్ లిఫ్టర్లు చాంపియన్లుగా నిలిచి బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్ పేర్కొన్నారు. క్రీడాకారులు ఎం.కుమార్‌రాజా, జి.సుభాషిణి, బి.మణిదీపక్‌లు వెయిట్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం, పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో ఎం.కుమార్‌రాజా, పి.జాన్‌బాబు, ఎ.మోహనకృష్ణ, కె.జ్యోత్స్నలు బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు, సంపా ఉషాకుమారి, స్టేడియం సత్యనారాయణ పాల్గొన్నారు.

అపరాలలో తెగుళ్లు నివారిస్తే అధిక దిగుబడులు

రాపర్ల(పామర్రు): అపరాల సాగులో తెగుళ్ల నివారిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని పామర్రు ఏడీఏ స్వర్ణలత పేర్కొన్నారు. మండల పరిధి రాపర్ల గ్రామంలో మినుము పంటను మచిలీపట్నం డీటీసీ కేంద్రం అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మినుము పైరును పరిశీలించారు. ప్రస్తుతం మినుము పంట తీత, కాయ దశల్లో ఉన్నదన్నారు. ఈ దశలో పొగాకు లద్దె పురుగు సోకే అవకాశాలు న్నాయన్నారు. పురుగు నివారణకు వ్యవసాయ శాఖాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ శివ నాగరాణి, డీటీసీ కేంద్రం అధికారులు పద్మజ, జ్యోతిర్మయి, స్థానిక రైతులు పాల్గొన్నారు.